

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
కడప	6.31	5.07
ప్రొద్దుటూరు	6.32	5.11



చలమారెడ్డి పల్లె కొండలో చెలరేగుతున్న మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

మండే కాలం..!

- అటు భానుడి ప్రతాపం..
- ఇటు చెలరేగుతున్న మంటలు

- 11 నెలల్లో 670 కేసులు
- అగ్నిమాపక శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 211 మందికి గాను 142 మంది సిబ్బంది

ఎండలు మండిపోతున్నాయి. రోజూ జిల్లాలో ఎక్కడోచోట ఏదో కారణంతోనే అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొండలు ఎక్కువగా ఉన్నాయి. తరచూ ఏదో ఒక కొండ కాలిపోతూనే ఉంది. అగ్నిప్రమాదాలను అరికట్టే అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. 211 మందికి గాను 142 మందే పనిచేస్తున్నారు. దీంతో జిల్లాలో ఒకేసారి రెండుమూడు చోట్ల ప్రమాదాలు జరిగితే నష్టనివారణ చేయడం వీరికి కష్టసాధ్యంగా మారుతోంది. ప్రజలు కూడా వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కడప క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎండాకాలం అంటే మండేకాలం. అగ్ని ప్రమాదాలకు అధికంగా జరిగే సమయం. భానుడి భగభగలకు తోడు మంటలు సులభంగా రేగే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి అగ్నిప్రమాదాల్లో కోట్లలో ఆస్తినష్టంతో పాటు ప్రాణాలు కూడా పోతుంటాయి. అగ్ని ప్రమాదాలను నివారించే అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏళ్ల తరబడి రిక్రూట్‌మెంటు లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. పాత భవనాలు పెచ్చులూడిపోతున్నాయి. కొన్ని చోట్ల స్థలం లేక ఇతర కార్యాలయాల సమీపంలో ఫైర్ ఇంజన్లను పార్కింగ్ చేస్తున్నారు.

11 నెలల్లో 670 కేసులు నమోదు

గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు అగ్నిమాపక శాఖకు 670 కాల్స్ వచ్చాయి. ఇందులో 44 రిస్క్ ఆపరేషన్ (రోడ్డు ప్రమాదాలు, నీటి ప్రమాదాలు) వచ్చాయి. ఇందులో రూ.8,62,54,000 నష్టం జరిగింది. రూ.19,63,91,000 ఆస్తినష్టాన్ని ఫైర్ అధికారులు రక్షించారు. ఇక అగ్ని ప్రమాదాల వల్ల ముగ్గురు చనిపోగా ఒకరిని రక్షించగలిగారు. అలాగే నీటి ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల కారణంగా 33 మంది చనిపోగా, 11 మందిని కాపాడారు. అలాగే ప్రమాదాల్లో ఇరుక్కున్న 23 పశువులను సురక్షితంగా రక్షించగలిగారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. లీడింగ్ ఫైర్‌మెన్లు, ఫైర్‌మెన్లు, డ్రైవర్ కమ్ ఆపరేటర్లు, సిబ్బంది కొరతతో అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో ఇబ్బంది పడుతున్నారు. జూనియర్ అసిస్టెంట్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. ఇక స్టేషన్ ఫైర్ ఆఫీసరు రెండు స్టేషన్లలో లేకపోవడంతో ఇన్‌చార్జి లీడింగ్ ఫైర్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ కమ్ ఆపరేటర్ 31 మందికిగాను ప్రస్తుతం 26 మంది విధులు నిర్వహిస్తున్నారు. 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఫైర్‌మెన్ 102 మంది ఉండాల్సి ఉండగా కేవలం 42 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 30 మంది హోంగార్డులతోనే విధులు నిర్వహిస్తున్నారు.

ముద్దనూరుకు ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రస్తుతం జిల్లాలో 8 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో పాత భవనాలు కలిగి ఉన్న కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో నూతన భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ముద్దనూరులో నూతనంగా ఫైర్ స్టేషను ఏర్పాటు చేసేందుకు కూడా ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే అక్కడ స్థలాన్ని సేకరించారు.

అగ్నిప్రమాదం జరిగితే ఫోన్ చేయాల్సిన నెంబర్లు..

స్టేషన్ పేరు	అధికారి	మొబైల్	ల్యాండ్
జిల్లా అధికారి	ఐ.ధర్మారావు	9949991068	08562-241739
కడప	బస్విరెడ్డి	9963737191	08562-242299
ప్రొద్దుటూరు	ఎ.రఘునాథ్	9963737486	08564-252999
జమ్మలమడుగు	ఎ.సత్యంరెడ్డి	9963737395	08560-270099
		9652478730	
కమలాపురం	జనార్ధనరెడ్డి (ఇన్‌చార్జి)	9963737598	08563-274250
బద్వేలు	ఎం.చంద్రుడు	9963737553	08569-284099
మైదుకూరు	సత్యరాజ్ (ఇన్‌చార్జి)	9963737634	8790201101
పోరుమామిళ్ల	నజీర్‌అహ్మద్	9963737637	08569-285101
వేంపల్లె	శివరామిరెడ్డి	9493497203	9441768101



ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సిద్ధం

ఎటువంటి అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కాల్స్ వచ్చిన కొన్ని నిమిషాల్లోనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. వాహనాలకు చిన్న చిన్న సమస్యలున్నప్పటికీ మరమ్మతులు చేయించాం. ఇప్పటికీ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ హోంగార్డులకు కూడా రెస్క్యూ ఆపరేషన్‌పై శిక్షణ ఇచ్చాం. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రజలందరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- ఐ.ధర్మారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

161 కేంద్రాల్లో పది పరీక్షలు

- 27,800 మంది విద్యార్థులు హాజరు



కడప ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి 161 కేంద్రాల్లో విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 17 నుంచి 31 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతాయి. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం సహా వెలుతురు, గాలి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 161 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 161 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1,677 మంది ఇన్విజిలేటర్లను నియమంచారు. ప్లైస్ స్క్వాడ్ 7 బృందాలు పర్యవేక్షించనున్నాయి. సమస్యాత్మకంగా ఉన్న ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్సు కేంద్రాలను మూసివేయనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 593 పాఠశాలల నుంచి 27,800 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

వాట్సప్ ద్వారా హాల్‌టికెట్లు

విద్యార్థులు హాల్ టికెట్లు పొందే అవకాశాన్ని తొలిసారి వాట్సప్ ద్వారా కల్పించారు. 9552300009 (వాట్సప్ గవర్నెన్స్) నెంబర్‌కు హాయ్ అని సంక్షిప్త సందేశం పంపితే సర్వీసు సెక్షన్ ఐచ్చికం వస్తుంది. అందులో విద్యాశాఖ తర్వాత ఎస్ఎస్‌సీ హాల్ టికెట్‌ను ఎంపిక చేశాక దరఖాస్తు సంఖ్య/చైల్డ్ ఇన్ఫో/పుట్టిన తేదీ వివరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించిన కేటగిరీ ఎంపిక చేస్తే హాల్ టికెట్ వాట్సాప్‌నకు వస్తుంది. అలాగే విద్యార్థులు హాల్ టికెట్లు చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. పరీక్ష సమయానికి కేంద్రాలకు హాజరయ్యేలా సర్వీసులు నడపుతున్నారు.

లోపాలు లేకుండా పర్యవేక్షిస్తున్నాం : డీఈవో

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా లోపాలు లేకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బాధ్యత ఇక ప్రజలదే

- పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి



మాట్లాడుతున్న లెక్కల జమాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విద్యాశాఖకు ప్రమాదకర పరిస్థితులు దాపురించాయని, ఇక ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాల్లో ఐదు రకాల బడులను ఏర్పాటు చేస్తున్నామని టీవీల్లో, పత్రికల్లో ఊదరగొడుతున్నారని అన్నారు. కానీ క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంఈవోల సమావేశం చూస్తే పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను లేకుండా చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులారా బలి కాబోతున్న గ్రామ ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులదే అని.. వారిలో చైతన్యం తెచ్చే బాధ్యత మనందరిదీ అన్నారు. జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ల బోధనకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 7,580 సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చిందని.. ఇవన్నీ ఇప్పుడు సర్‌ప్లస్ అవుతాయని చెప్పారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి, దిలీప్‌కుమార్, రామలక్ష్మిరెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈవో శుక్రవారం షంషుద్దీన్ తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయన్నారు. విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. పదవ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి 5గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

అశోక్‌రెడ్డి వెనకున్న శక్తి ఎవరు?

- ప్రశ్నించిన మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడిస్తూ పట్టుబడిన కడప 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డిని వెనుక ఉండి కాపాడుతున్న శక్తి ఎవరని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ప్రశ్నించారు. అతడికి 41ఏ నోటీసు ఇచ్చి ఎందుకు వదిలిపెట్టారో పోలీసులే చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కిందన్నారు. పది నెలల కాలంలో మద్యం ఏరులై పారేలా చేసిందన్నారు. టన్నుల కొద్దీ గంజాయి సరఫరా చేస్తూ విద్యార్థులతో అమ్మకాలు చేస్తోందని విమర్శించారు. అడ్డు అదుపు లేకుండా పార్టీ నేతల కనుసన్నల్లో జూదం సాగిస్తున్నారని మండిపడ్డారు. కడప నగరం 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి జూదం నిర్వహిస్తూ రాయచోటిలో పట్టుబడినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలిసి అశోక్‌రెడ్డి తీసుకున్న ఫొటోలను చూపిస్తూ లక్ష రూపాయలు కట్టి టీడీపీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నాడని అన్నారు. ఇలాంటి వ్యక్తి తమ పార్టీలో ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. సమీప బంధువు కొండారెడ్డిని సైతం అరెస్టు చేయించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వెనుక ఉన్న నేతలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ షఫి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, దాసరి శివప్రసాద్, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డిని కాపాడుకుంటాం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అశోక్‌రెడ్డి 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అని.. అందువలన అతడిని కాపాడు కుంటామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని తెలిపారు. గత వైసీపీ హయాంలో సీఐ అశోక్ రెడ్డి చేసిన అక్రమాల విచారణలో భాగంగా రాజారెడ్డి వీధి అశోక్‌రెడ్డిని తీసుకెళ్లి విచారిం చారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఐ అశ్‌కొరెడ్డి బినామీలను పెట్టుకొని చేసిన దందా లు భూకబ్జాలు అక్రమాలపై విచారణ జరుగు తోందని స్పష్టం చేశారు. రాయచోటి పోలీసులు అశోక్‌రెడ్డిని తీసుకెళ్లింది వైసీపీ హయాంలో ఉన్న సీఐ అశోక్‌రెడ్డి బినామీ కావడంతోనే అని పేర్కొన్నారు. తాము మేనిఫెస్టోలో శాంతి కడప, స్వచ్ఛ కడప అనే నినాదంతో ఎన్నికల్లో పోటీ చేశామని గుర్తు చేశారు. అసాంఘిక కార్యకలా పాలను నిర్మూలిస్తామని చెప్పే సొంత మేనిఫె స్టో విడుదల చేసి ముందుకు వెళ్లామని కడప ప్రజలు తమను ఆశీర్వదించారని తెలిపారు. కడపలో మట్కా, జూదం, గంజాయి లాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉక్కు పాదంతో అణచివేస్తున్నామని వివరించారు. గతంలో అంజాద్‌బాషా ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన సొంత అనుచరులే కేంద్రాలు పెట్టి గంజాయి అమ్ముతూ పోలీసులు పట్టుకుంటే ఆయన తమ్ముడు విడిపించిన సంఘట నలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు.

లారీ ఢీకొనడంతో దంపతులు మృతి

- కుమారుడికి తీవ్రగాయాలు
- పొలం పనులకు వెళ్లి వస్తుండగా ఘటన





సంఘటన స్థలంలో దంపతుల మృతదేహాలు, (ప్రక్కన పసుపులేటి చలపతి, లక్ష్మీదేవి (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి వస్తున్న వారిని లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు దుర్మరణం చెందగా వారి కుమారుడు తీవ్రంగా గాయపడిన దుర్ఘటన శుక్రవారం మైదుకూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పసుపులేటి చలపతి(60), పసుపులేటి లక్ష్మిదేవి(50), కుమారుడు వినోద్ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. వీరు ముగ్గురూ శుక్రవారం గంగవరం రోడ్డులో ఉన్న వారి పొలం వద్దకు వెళ్లి అక్కడ పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. వినోద్ ద్విచక్రవాహనం చిన్నగా నడుపుకుంటూ వెళుతుండగా కేశలింగాయపల్లె దాటగానే ముందు వెళుతున్న లారీకి గొర్రెల మంద అడ్డురావడంతో బ్రేక్ వేసి రోడ్డుపై నిలిపాడు. వినోద్ కూడా తన వాహనాన్ని స్లో చేశాడు. ఇంతలో వెనుక నుంచి మరో లారీ అదుపుతప్పి వచ్చి వారిని ఢీకొంది. దీంతో వినోద్ వాహనం నుంచి పక్కకు పడిపోగా అతని తల్లిదండ్రులు చలపతి, లక్ష్మీదేవి లారీ కింద పడి నుజ్జునుజ్జు అయ్యి మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వినోద్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మైదుకూరు సీఐ హసం సంఘటన స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌ను అదుపుచేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

- జ్యోతి క్షేత్రానికి రూ.5 లక్షలు అందజేసిన రితేశ్‌రెడ్డి



నిర్వాహకులకు రూ.5క్షల విరాళం చెక్కును అందజేస్తున్న రితేశ్‌రెడ్డి

కాశినాయన మార్చి14(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వాల సహకారంతో కలసికట్టుగా జ్యోతి క్షేత్రానికి పూర్వవైభవం తీసుకువద్దామని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కె.రితేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు కాశినాయన ఆశ్రమాన్ని సందర్శించారు. కాశినాయన ఆశ్రమంలో అధికారులు కూలదోసిన నిర్మాణాల స్థానంలో శరవేగంగా జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన విలేరుకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమైన కాశినాయన ఆశ్రమ అభివృద్ధికి ఈ ప్రాంత వైసీపీ నేతగాని, జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు గానీ చేసింది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. నాడు కేంద్రానికి లేఖ రాశాడని గొప్పగా చెప్పిన వైసీపీ పెద్దలు వారు పంపిన ఫైల్ వెనక్కివస్తే ఎందుకు తిరిగి కేంద్రానికి పంపలేకపోయారో చెప్పగలరా అన్నారు. ఢిల్లీలో అటవీశాఖ మంత్రిని కలిసి కాశినాయన ఆశ్రమ సమస్యను తెలియజేయగా సానుకూలంగా స్పందించి 5.5 హెక్టార్లు కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఇకనైనా కాశినాయన ఆశ్రమంపై రాజకీయాలు మాట్లాడకుండా అభివృద్ధికి కలిసిరావాలన్నారు. అనంతరం కె.రితేశ్‌రెడ్డి రూ.5 లక్షలు చెక్కును ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గురివిరెడ్డి, మండల టీడీపీ నాయకులు బి.రవీంద్రారెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు జీరయ్య స్వామి, ఆలయ నిర్వాహకుడు బసిరెడ్డి చెన్నారెడ్డి, బీజేపీ నాయకుడు బొజ్జా రోశన్న తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్యకేసులో..

దస్తగిరికి భద్రత పెంపు

కడప క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో అప్రూవర్ దస్తగిరికి భద్రత పెంచారు. గతంలో 2 ప్లస్ 2 గన్‌మెన్లు ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చాక గన్‌మెన్లను కుదిస్తూ 1 ప్లస్ 1కు చేర్చారు. వివేకా హత్య కేసులో పలువురు సాక్షులు ఇప్పటికే చనిపోయారు. ప్రత్యక్ష సాక్షి రంగన్న వారం క్రితం చనిపోయారు. వివేకా కేసులో అత్యంత కీలకమైన వ్యక్తి దస్తగిరి. ఈ నేపథ్యంలో తనకు భద్రత పెంచాలంటూ రెండురోజుల క్రితం దస్తగిరి కడప ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారడంతో వైసీపీ నుంచి తనకు బెదిరింపులు వచ్చాయని, డబ్బు ఆశ చూపించారని తెలిపారు. అయినా తాను వారికి లొంగకుండా వివేకా హత్యకు సంబంధించి ప్రాయశ్చిత్తంగా అప్రూవర్‌గానే ఉండాలని నిర్ణయించుకున్నానన్నారు. పలువురు సాక్షులు చనిపోతుండటంతో తనకు వైసీపీ నేతల నుంచి రక్షణ కల్పించాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దస్తగిరికి ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ 2 ప్లస్ 2 గన్‌మెన్లను కేటాయించారు. అలాగే అతని ఇంటిపై కూడా లోకల్ పోలీసులతో నిఘా ఉంచారు.

వంకలతో ప్రమాదం
- వర్షాకాలంలో ఆ గ్రామాలు జలదిగ్బంధమే 7


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషేన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం./కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

పాము కాటుతో రెండేళ్ల చిన్నారి మృతి


అమృతసాగర్ (ఫైల్‌ఫొటో)

నిమ్మనపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీకి చెందిన పద్మనాభం,సుభాషిణిల కుమారుడు నీరుగిట్టి అమృతసాగర్(2) జాతర చూసేందుకు గురువారం తన తల్లిదండ్రులతో కలసి చౌడేపల్లికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 7గంటల సమయంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా పాటుకాటుకు గురయ్యాడు. గమనించిన తండ్రిదండ్రులు వెంటనే అమృతసాగర్‌ను చౌడేపల్లి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆలస్యంగా స్పందించడంతో, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షచేసి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరునవిపించారు. కాగా తల్లి పద్మావతి సోమల మండలంలో లెక్చరర్‌గా పని చేస్తుండగా తండ్రి పద్మానాభం నిమ్మనపల్లి ఎమ్మార్సీలో సీఆర్పీగా పని చేస్తున్నాడు. చిన్నారిమృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

గిరిజన మహిళపై వైసీపీ నేత బంధువు దాడి


మీడియాతో మాట్లాడుతున్న సునీత

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన వైసీపీ నేతపై పోలీసులకు ఫిర్యాదు చేసి, 24 గంటలు అవుతున్నా ఇంతవరకూ కేసు కట్టలేదని ఓ గిరిజన మహిళ మీడియా ఎదుట వాపోయింది. బాధితురాలి కథనం మేరకు...పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన కె.కృష్ణానాయక్ భార్య సునీతకు అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నేత బంధువు బాలిరెడ్డికి ఇంటి స్థలం విషయమై ఐదేళ్లుగా వివాదం నడుస్తోంది. గురువారం సాయంత్రం బాలిరెడ్డి పునాదులు నిర్మిస్తుం డగా సునీత వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బాలిరెడ్డి, అతని బంధువులు కలసి సునీత జుట్టుపట్టుకుని లాగి, ఇనుపరాడ్డు, రాళ్లతో ఆమె తలపై దాడి చే శారు. ఈ దాడిలో తలపగలడంతో సునీత స్పృహ కోల్పోయింది. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం సు నీత స్థానిక టు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కానీ వారినుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకు వేచి చూసిన ఆమె మీడియాతో తన గోడు వెళ్లబోసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాల్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తే టూటౌన్ పోలీసులు తనపై కేసు కట్టారని ఆరోపించింది. బాధితురాలిపై కేసు నమోదు చేశారని శుక్రవారం హోంమంత్రికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించింది. ఈ విషయమై ఎస్‌ఐ రహీముల్లాను వివరణ కోరగా స్టేషన్‌కు వచ్చిన బాధితురాలు తమకు ఫిర్యాదు ఇవ్వలేదని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పి ఇంటికి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఫిర్యాదు ఇస్తే ప్రాథమిక విచారణ చేసి న్యాయం చేస్తామని వివరించారు.

గుర్రంకొండలో దొంగలు పడ్డారు


దొంగలు కత్తిరించిన దుకాణపు రేకు, మరో దుకాణంలో ఖాళీగా గల్లాపెట్టె

గుర్రంకొండ, మార్చి 14: పట్టణంలో గురు వారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. బస్టాండు ప్రాంతంలో చిన్న వ్యాపారులు ఏర్పా టు చేసుకున్న రేకుల బంకులకు కన్నాలేసి అంది నమేరకు దోచుకెళ్లారు. పట్టణానికి చెందిన షైషా వలి దుకాణం వెనుక వైపు రేకును కత్తిరించి లోపలికి చొరబడి రూ.30 వేలు నగదు, రూ.30 విలువ చేసే సిగరెట్లను చోరి చేశారు. పక్కనే ఉన్న ఆంధ్ర ఎలక్ట్రికల్స్ దుకాణం పైకప్పు రేకును కత్తిరించి రూ.60 వేలు నగదు, జాతీయ రహదారిపై ఉండే బాషాఖాన్ జనరల్ స్టోర్ పైకప్పు రేకును కత్తిరించి రూ.15 వేలు విలువ గల సిగరెట్లు చోరీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఒక రోజు మూడు దుకాణాల్లో చోరీ జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గుర్రంకొండ పట్టణంలో బయట వ్యక్తులు అధికంగా ఉండడంతోనే చోరీలు జరుగుతున్నట్లు ప్రజలు, వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


కురబల కోట మండలం తానామిట్ట వద్ద ఢీకొన్న వాహనాలు



మృతి చెందిన భాస్కర్, సయ్యద్ హసన్


ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు


ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ (ఫైల్‌ఫొటో)

కురబలకోట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కురబల కోట, గుర్రంకొండ మండలాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి.. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి గ్రానైట్ బండలతో రాజమండ్రికి వెళుతున్న లారీ, సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట నుంచి బెంగళూరుకు వెళుతున్న కంటైనర్ లారీ శుక్రవారం వేకువన మండలంలోని తానామిట్ట వద్ద ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అధిక వేగంతో వెళుతుండడంతో నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో కర్నాటక రాష్ట్రం హాసన్ జిల్లా హలేహాళ్లికి చెందిన కంటైనర్ డ్రైవర్ భాస్కర్(36), రాయచోటికి చెందిన లారీ క్లీనర్ సయ్యద్ హస్సేన్(28) అక్కడిక్కడే మృతి చెందారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ మృతదేహాన్ని వాహనం ముందు బాగాన్ని జేసీబీ సాయంతో తొలగించి బయటకు తీశారు. తల, కాళ్లకు బలమైన గాయాలైన లారీ డ్రైవర్ గాలివీడుకు చెందిన నాగేశ్వరరావును 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రుయా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, సీఐ సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

గుర్రంకొండ: మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన వెంకటప్ప కుమారుడు నాగరాజ(45) శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం తరిగొండకు వచ్చాడు. స్వామి వారిని దర్శించుకొని ఆటోలో వాల్మీకిపురానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న నాగరాజ కిందపడడంతో తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే అతనిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్..

మదనపల్లె అర్బన్: మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన చల్లా సుధాకర్ (48) మదనపల్లె ఆర్టీసీ టూ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మదనపల్లె నుంచి బైక్‌పై బార్లపల్లెకు వెళుతుండగా బెంగళూరు నుంచి కూరగాయల లోడుతో వస్తున్న బొలెరో ఢీకొట్టింది,

ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ అక్కడిఅక్కడే మృతి చెందాడు. తాలూకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకట రమణ తెలిపారు.

వర్డ్‌పవర్ రాష్ట్ర స్థాయి పోటీలో చింతమాకులపల్లె విద్యార్థికిమూడో స్థానం


అన్విత్‌కు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కలికిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ చాంపియన్ షిప్‌లో మండలంలోని కలికిరి పంచాయతీ చింతమాకులపల్లె ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న పి. అన్విత్ మూడో స్థానంలో నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్లంపై ఏ స్థాయిలో పట్టుందన్న విషయాన్ని గుర్తించ డానికి విభాలీప్ వర్డ్ సంస్థ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో 'ది వర్డ్ పవర్ చాంపియన్‌షిప్' పేరుతో విద్యార్థుల మధ్య ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 27న రాయచోటిలో జరి గిన జిల్లా స్థాయి పోటీల్లో అన్విత్ ప్రథమ స్థానం లో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో పోటీ పడటానికి అర్హత సాధించాడు. విజయవాడ టూరిజం ప్రాంగణంలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్విత్ మూడో స్థానం దక్కించుకున్నా డు. గురువారం రాత్రి అతనికి అవార్డును బహూకరించారు. విభా సంస్థ పీడీ శ్రీనివాసరావు, కార్యదర్శి వీరనారాయణ, రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు అన్విత్‌ను అభినందించి అవార్డుతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆ విద్యార్థిని తీర్చిదిద్దిన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయిని హసీనాను అభినందించారు. కాగా అన్విత్ తల్లి ఎం.హేమలత వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. ఏ మా త్రం బేషజాలకు పోకుండా తన కుమారుడిని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే చదివిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధం


కాలిపోయిన గుడిసె

వాల్మీకిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. మండలంలోని గండబోయనపల్లె పంచాయతీ కంభంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, వెంకట రమణా రెడ్డి పొలాలు, రైల్వే రోడ్డుకు సమీపంలో ఉన్నాయి. రైల్వే ట్రాక్ పక్కన గడ్డి ఏపుగా పెరిగి పోవడంతో దానిని తొలగించేందుకు శుక్రవారం రైల్వే సిబ్బంది నిప్పంటించారు. దీంతో మంట లు ఎగిసి తమ పొలాల్లోని డ్రిప్ పైపులు, టమోటా పంట, గుడిసె కాలి పోయాయని రైతులు వా పోయారు. ప్రభుత్వం స్పందించి తమకు జరిగిన నష్టం విషయమై ఆదుకోవాలని కోరుతున్నారు.

బిదినంచెర్లలో ఘనంగా గోపూజ మహోత్సవం


గ్రామోత్సవంలో భక్తులు

సింహాద్రిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిదినంచెర లో శుక్రవారం గోపూజ నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి పూజ, కలశ పూజ, గోపూజ, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భాగవత పండితులను బీఎస్ బ్రంహ్మానందరెడ్డి, జడ్పీటీసీ బీఎస్ ఝాన్సీరాణి దంపతులు శాలువాతో సత్కరించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

రేపు కడపలో మాజీ సైనికుల ర్యాలీ, సమావేశం

మదనపల్లె టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబీకుల సమస్యల పరిష్కారం కోసం 16న కడపలో ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం కడపలో నిర్వహించే మాజీ సైనికుల కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా లెఫ్టినెంట్ జనరల్ అజయ్‌మిశ్రా, రిటైర్డ్ బ్రిగేడియర్ బి.వెంకటరెడ్డి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్, కడప కలెక్టర్ హాజరవుతారన్నారు. మాజీ సైనికుల కుటుంబాల విద్య, వైద్యం, పెన్షన్, ఇతర సమస్యలను అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు. సైనిక వితంతువుల కోసం మదనపల్లె నుంచి రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడపలో జరిగే కార్యక్రమాన్ని మాజీ సైనికులు, వారి కుటుంబీకులు విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు 95024 26333 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని శ్రీనివాసులు నాయుడు కోరారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం చియ్యవరం హరిజనవాడకు చెందిన ఎర్రతోట మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమ్మపల్లికి చెందిన ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. బాధితుడు మహేష్ పట్టణంలోని బైక షోరంలో గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా వేణు మరో ఇద్దరు బైకుకు అడ్డుపడి దాడి చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక వ్యాపారులు కొట్టారని టిప్పర్ డ్రైవర్ ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తక్కువ రేటుతో మదనపల్లెకు ఇసుక తరలిస్తున్నావంటూ ఇసుక వ్యాపారులు తనను కొట్టారని టిప్పర్ డ్రైవర్ సుబ్రమణ్యం శుక్ర వారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము 24 వేలకు టిప్పర్ ఇసుక అమ్ముతుంటే నీవు రూ. 18,500కే ఇసుక అమ్ముతావా అంటూ బిల్డర్ భరత్, ప్రసాద్‌రెడ్డి, రమేష్, ముబారక్‌బాషా, మణి, అమర, మరికొందరు కలిసి కొట్టారని బాధితుడు తెలిపారు. ఇకపై ఇసుక మదనపల్లెకు తీసుకురాకూడదని, తెస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని హెచ్చరించారంటూ స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం రద్దు

● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



నందిమండలంలోని ఉన్నత పాఠశాల

పెండ్లిమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే మొట్టమొదటగా నంది మండలం గ్రామంలో 1948లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొదట్లో మండలంలోని విద్యార్థులంతా నందిమండలం ఉన్నత పాఠశాల పరీక్షకేంద్రంగా పరీక్షలు రాసేవారు. ఐతే విద్యార్థుల సంఖ్య పెరిగే కొద్ది పరీక్షకేంద్రాలను వెల్లటూరు, పెండ్లిమర్రి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. 2023-24 విద్యాసంవత్సరం కూడా చౌటపల్లె, జీసీపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులు, నందిమండలం పాఠశాల విద్యార్థులతో కలసి ఇక్కడే పరీక్షలు రాశారు. కానీ ఈనెల 17వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపధ్యంలో ఈ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల అన్ని గ్రామాలకు సెంటర్ కావడంతో విద్యార్థులకు అనుకూలంగా ఉండేది. పరీక్షా కేంద్రాన్ని ఉన్నపళంగా రద్దు చేయడం అన్యాయమని, విద్యాశాఖ అధికారులు కనీసం పత్రికాముఖంగా కూడా తెలపకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నందిమండలం ఉన్నత పాఠశాలలోనే పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పోలీసుస్టేషన్‌కు దూరంగా ఉండటంతో..

పోలీసు స్టేషన్‌కు దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఇక్కడ మాత్రమే కాదు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇలాంటి కేంద్రాలను గుర్తించి రద్దు చేశారు.

- సుజాత, మండల విద్యాశాఖ అధికారి

లక్ష్మీనారసింహుడి కల్యాణం..
లోకాలకే వైభోగం..


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారసింహుడి కల్యాణం.. లోకాలకే వైభోగం అన్నట్లుగా స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. మాచిరెడ్డిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారికి వివిధ పూజలు, హోమాలు, అభిషేకాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. అనంతరం మూలవిరాట్‌లను అలంకరించి కళ్యాణవేదికపై ఆశీనులు చేశారు. పుత్తా కుటుంబీకులతో కన్యాదానం చేయించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణ తంతును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహస్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారి కల్యాణఘట్టాన్ని వీక్షించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఎస్పీని శాలువాతో సత్కరించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. అలాగే వృషభరాజముల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. నాలుగురోజులుగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పుత్తా నరసింహారెడ్డి భార్య సరళమ్మ, ఎమ్మెల్యే సతీమణి చైతన్యరెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి, ఆయన భార్య వెంకటసుబ్బమ్మ, యువనేత సాయి నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పుష్పగిరి గిరిప్రదర్శనతో పుణ్యఫలితం

● అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్


గిరిప్రదక్షిణకు ముందు గోపూజ చేస్తున్న దృశ్యం

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరి ప్రదక్షిణ చేయడం వల్ల పుణ్యఫలితం లభిస్తుందని దేవదాయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆయన గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ గోపూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు. గిరిప్రదక్షిణ సంపూర్ణంగా దేవదాయశాఖ, ఆలయ అనువంశిక ధర్మకర్త సమక్షంలో కొండ చుట్టూ గ్రామ సేవా కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో జరుగుతుందన్నారు. ముందుగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతనంగా గిరిప్రదక్షిణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, బసిరెడ్డి భక్తులు ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేశారు.

అల్లర్లు చేసినా.. గొడవలు సృష్టించినా కఠిన చర్యలే

● డీఎస్పీ వెంకటేశ్వర్లు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ఎవరు నడుచుకున్నా, అల్లర్లు చేసినా, గొడవలు సృష్టించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించడంతో పాటు కేసులు, ఇటీవల జరిగిన సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తుంటారని, అలా జరిగే సమయంలో ఎవరైనా గొడవలకు దిగి, ఇబ్బందులు కలిగిస్తే వారిపై తీవ్ర చర్యలుంటాయన్నారు. కొన్ని అల్లరి మూకలు అదేపనిగా గొడవలకు మూలం అవుతున్నాయని, వాటిపై పోలీసులు అలర్ట్‌గా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటర్ గండి, పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్టలాంటి ప్రాంతాల్లో ఆదివారం, సెలవు దినాల్లో బోర్డులు చూసి నీటిలో దిగకుండా జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అలాగే చెన్నూరు క్రాసింగ్ నుంచి కొండపేట రోడ్డు వరకు రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. రంజాన్ తరువాత ఈ విషయంపై దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా తొలగింపులు చేపడతామన్నారు. అలాగే ఇసుక, బియ్యం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెంచాలని సీఐ పురుషోత్తంరాజుకు సూచించారు.

వంకలతో ప్రమాదం

● వర్షాకాలంలో ఆ గ్రామాలు జలదిగ్బంధమే
● బాహ్యప్రపంచంతో సంబంధం కట్
● నేటికీ శివాలపల్లె, రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె, రామనపల్లెలో ఇదే పరిస్థితి..
● పట్టించుకోని పాలకులు

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎవరికైనా ప్రాణాపాయ పరిస్థితి వస్తే ఎటు వెళ్లాలన్నా చుట్టూ నీరే.. వంకలపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో వంకలు దాటలేని పరిస్థితి, గ్రామంలో వైద్యం లేని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లోనే మండలంలోని శివాలపల్లె, రాచిన్నాయపల్లె, రామనపల్లె, ముండ్లపల్లె ఉన్నాయి. ఈ గ్రామాలు వంకలతో ముప్పు తప్పించలేకున్నాయి. ఒక్కోమారు రోజుల తరబడి రాకపోకలు చేయలేని పరిస్థితి. ఈ సమస్యల నుండి గట్టెక్కించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా నాయకులు స్పందించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వంకల గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. నేటికీ ఒక్క వంకపై చిన్నపాటి హైలెవల్ వంతెన కూడా ఏర్పాటు చేయలేదంటే ప్రజలపై ఎంత నిర్లక్ష్యమోనని ఆవేదన చెందుతున్నారు.

జింకల వంక పొంగితే..

మంచి రైతులు, ఉన్నత విద్యావంతులు ఉన్న గ్రామం శివాలపల్లె. కానీ ఆ ఊరికి పక్కనే ఉన్న జింకల వంక పొంగితే తగ్గేంత వరకు వారు మండల కేంద్రానికి రాలేరు. వచ్చే అవకాశం లేదు. దాటడానికి చిన్న కాజ్‌వే కూడా లేదు. ఒకవేళ రావాలంటే దాదాపు పది, పన్నెండు కిలోమీటర్లు చుట్టి రావాల్సిందే. మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రానికి రావాలంటే ఈ ప్రయాస ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


శివాలపల్లె వద్ద జింకల వంకపై ఉన్న లోలెవల్ కాజ్‌వే

ముండ్లపల్లె-రామనపల్లె పరిస్థితి

ముండ్లపల్లె గ్రామ సమీపంలో ఓబులంపల్లె వెళ్లే దారిలో ఉన్న ఉప్పువంక వర్షాకాలం ఉధృతంగా ప్రవహిస్తుంది. ఏమరుపాటుగా అందులో అడుగుపెడితే గల్లంతు కావాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వంకపై ఉన్న చిన్నపాటి లోలెవల్ కాజ్‌వేను మరో 5 అడుగుల ఎత్తు పెంచితే సమస్య ఉండదని ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే చెన్నూరు నుండి రామనపల్లె వచ్చే వంక పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఎన్నో మార్లు ఎడ్లు, ఎనుములు, ద్విచక్ర వాహనదారులు ఈ వంకలో పడిపోయారు. లోలెవల్ కాజ్‌వేను ఎత్తు పెంచాలని ఏళ్ల తరబడి అడుగుతున్నా పట్టించుకునేవారు లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

రాళ్ల వంకతో రాచిన్నాయపల్లెకు ముప్పు

రాచిన్నాయపల్లె సమీపంలోని రాళ్లవంక ప్రతి ఏటా వర్షానికి పెద్ద నదిలా ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడ ఉన్న లోలెవల్ కాజ్‌వే దాటడం వీలుకాదు. ఫలితంగా కడప నగరానికి రామనపల్లె, చిన్నమాచుపల్లె మీదుగా సుమారు 10 కి.మీ తిరిగి వెళ్లాల్సిందే. కళ్లముందు కనిపించే నగరానికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని ప్రజలు బాధపడుతున్నారు. వంకపై హైలెవెల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


రాచిన్నాయపల్లె సమీపంలో రాళ్ల వంకపై లోలెవల్ కాజ్‌వే

మా సమస్య తీర్చండి..



ఎన్నో ఏళ్లుగా జింకల వంకతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం మా పరిస్థితి మరీ దారుణం. వంకకు నీరు వచ్చిందంటే బయటికి వెళ్లలేని పరిస్థితి, బిక్కుబిక్కుమంటూ కూర్చోవాల్సిందే. పాలకులు స్పందించి ఈ వంకపై హైలెవెల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలి.

- సుంకేసుల శ్రీనివాసులు, శివాలపల్లె

ప్రమాదాలు లేకుండా చూడాలి..



ముండ్లపల్లె వంక వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా వంకలపై హైలెవెల్ కాజ్‌వేలు ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- యామల మణికంఠ, ముండ్లపల్లె

సబ్‌జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు
మొదటిరోజు హోరాహోరీ

● తలపడనున్న 13 జిల్లాల జట్లు ● క్రీడారంగం బలోపేతానికి కృషి : ఎమ్మెల్సీ


పోటీలకు హాజరైన 13జిల్లాల కబడ్డీ జట్లు

పులివెందుల రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగే 34వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమ య్యాయి. స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఎమ్మెల్సీ రామగో పాల్‌రెడ్డి, పులివెందుల ఆర్డీవో చెన్నయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను, కబడ్డీ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కేడట్లు 13 జిల్లాల క్రీడాకారులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. పీపీపీ విధానాన్ని అమలు చేసి విద్యాసంస్థలలో ప్రతి వంద సీట్లలో మూడు సీట్లు క్రీడాకారులకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, మాజీ డీఎస్పీ రామచంద్రారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్ కొండయ్య, కోచ్ శ్రీధర్, ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన పోటీలు

పులివెందులలో జరిగిన అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాయ్స్ విభాగంలో కడప, విశాఖపట్టణం తలపడగా కడప 26పాయింట్లతో గెలిచింది. అలాగే కృష్ణా, నెల్లూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణా.. అనంతపురం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో చిత్తూరు.. విశాఖపట్టణం, విజయనగరం మధ్య జరిగిన పోటీలో విజయనగరం గెలిచాయి. అలాగే గర్ల్స్ విభాగంలో కడప, ఈస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో కడప.. నెల్లూరు, వెస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో వెస్ట్‌గోదావరి.. విశాఖపట్టణం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్టణం.. కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జట్టు విజేతలుగా నిలిచాయి.

విద్యార్థిని ఆత్మహత్య


మృతి చెందిన అక్షయ

జమ్మలమడుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో శుక్రవారం మధ్యాహ్నం అక్షయ (18) అనే విద్యార్థిని విషద్రావణం తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా సిబ్బంది, స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాంబెల్ వైద్యశాలకు తరలించగా రాత్రి 8.30 గంటల సమయంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. పెద్దముడియం మండలం కొండసుంకేసులకు చెందిన అక్షయ జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. వసతి గృహంలోని ఇతర విద్యార్థినులతో మనస్పర్థలు రావడంతో విరక్తి చెంది విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుందని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అర్బన్ సీఐ, ఏఎస్‌డబ్ల్యూ గురుప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే పట్టణంలోని విద్యార్థి సంఘాలు, టీఎన్‌ఎస్‌ఎఫ్, డీవైఎఫ్ఐ, సీపీఐ నాయకులు వసతి గృహంలో జరిగే సమస్యలపై ఏఎస్‌డబ్ల్యూతో మాట్లాడారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక్కగానొక్క కూతురు చనిపోవడంతో విద్యార్థిని తల్లి పద్మావతి బోరున విలపించింది. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట విద్యార్థి సంఘ నాయకులతో పాటు ఆమె ఆందోళనకు దిగారు.

చికెన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ1.80.లక్షల ఆస్తినష్టం

ఎర్రగుంట్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలమకూరులోని ముద్దనూరు రోడ్డులో నరేష్‌కుమార్(బుజ్జి)కి చెందిన చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.1.80లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి 9గంటలకు చికెన్ సెంటర్‌ను మూసివేశానని, తెల్లవారుజామున 2.40గంటలకు షాపు, కోళ్లు కాలిపోతున్నాయని ఫోన్‌వచ్చిందని తెలిపాడు. ఈ ప్రమాదంలో 70 కోళ్లు, రెండు కాటా మిషన్‌లు, టేబుల్ ఫ్యాన్, నాలుగు కుర్చీలు, రూ.1.70 అప్పులపట్టీ, రెండు సిలిండర్స్, విద్యుత్ మీటర్ కాలిబూడిదయ్యాయని వాపోయాడు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందో తెలియడంలేదని, సుమారు రూ.1.80లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందన్నాడు.

శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

● జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న చిన్నకొట్టి చంద్ర

కడప రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నకొట్టి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శారీరక దివ్యాంగ ఉద్యోగుల (అన్నీ ప్రభుత్వశాఖలు) సంక్షేమ సంఘం ఉమ్మడి కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లయ్య నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. సంఘం నూతన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనతో పాటు గౌరవ అధ్యక్షుడుగా బి.సుధాకర్, జిల్లా అధ్యక్షుడుగా పులిమి జేమ్స్, జిల్లా ట్రెజరర్‌గా బత్తుల చంద్రశేఖర్, జిల్లా సమాచార కార్యదర్శిగా పి. సుబ్బరాజు, జిల్లా కార్యదర్శులుగా వై. గుర్రప్ప, హెచ్. నరసింహులు, జిల్లా కన్వీనర్‌గా యం. రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని శారీరక దివ్యాంగ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధుడు మృతి

ముద్దనూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బీంచర్ల శివారెడ్డి (91) రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్ఐ సమాచారం మేరకు.. బీంచర్ల శివారెడ్డి సొంత గ్రామం కొర్రపాడు. 10 సంవత్సరాల నుంచి ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెలో నివాసం ఉంటున్నారు. మతిస్థిమితంలేని కారణంగా కొర్రపాడుకు వచ్చి రైలు కింద పడి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు..?

వేంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి హామీని ఎప్పుడు నెరవేరుస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా పూర్తిస్థాయిలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. ఆడబిడ్డ నిధికింద నెలకు రూ.1500, ఉచిత బస్సు వెంటనే అమలు చేయాలి డిమాండ్ చేశారు.

'మహిళలకు రక్షణ కరువు'

కడప కలెక్టరేట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం, వేపాడు మండలం, గుడివాడ గ్రామంలోని వేణుగోపాల స్వామి తీర్థం వద్ద విధుల్లో ఉన్న పోలీసు అధికారి దేవిని యువకులు దూషించడం, మహిళా పోలీసు అధికారిని జుట్టు పట్టుకొని పక్కకు లాగడం, ఫోన్ లాగడం, దుర్భాషలాడుతూ దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆ అధికారి భయంతో పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకోవాల్సిన దుర్భర పరిస్థితి రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థలో ఉండే మహిళలకే రక్షణ లేకుంటే సామాన్య మహిళలకు రక్షణఎలా?అని ప్రశ్నించారు. జిల్లాలో కూడా కమలాపురంలో లక్ష్మీదేవి అనే మహిళపై దుండగుడు దాడి చేసి బంగారు ఆభరణాలు దోపిడీ చేశాడని, మహిళల రక్షణ కోసం ఆందోళనకు సిద్ధం కావడం తథ్యమన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

సికెదిన్నె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని ఏడీ డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, చంద్రకిశోర్, మహమ్మద్‌రఫి పాల్గొన్నారు.

తాగునీటి కటకట

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకునే వారేరీ..?



ఎడారిలా కనిపిస్తున్న పాపాఘ్నినది



వేంపల్లె పంచాయతీ పరిధిలోని పులివెందుల రోడ్డులో ఎండిన బోరు

వేంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో నీటి ఎద్దడి ముంచుకొచ్చింది. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు నీరు సక్రమంగా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. పక్కనే పాపాఘ్ని నది ఉన్నా ఆ నదిలో ఉన్న నీరు వేంపల్లె పట్టణంలోని చాలా ప్రాంతాలకు రావడం లేదు. వేసవితాపం పెరగడం వల్ల ఆ ఫిల్టర్లలో నీరు తగ్గి గతంలో వచ్చే ప్రాంతాలకు కూడా నీరు రావడం లేదు. పట్టణంలోని పలు చోట్ల బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ వేంపల్లె పట్టణంలోని పులివెందుల రోడ్డు శ్లోకస్కూల్‌కు వెళ్లే దారిలో ఉన్న పంచాయతీ బోరు వారం రోజులుగా నీరు రావడం లేదు. ఆ చుట్టుపక్కల కాలనీ వాసులకు నీటి సమస్య తీవ్రమైంది. ఇతర ప్రాంతాలు, పక్క వీధులకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు. అలాగే రాజీవ్‌కాలనీలోని పైప్రాంతంలో పలుచోట్ల నీరు సక్రమంగా రావడం లేదంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య ఉన్న చోట మళ్లీ బోరువేయించడం లేదా ట్యాంకర్ ద్వారా సరఫరాచేయడమో చేయాలని కోరుతున్నారు.

వారం రోజులుగా నీరు రావడం లేదు



వారం రోజులుగా నీళ్ల రావడం లేదు. రోడ్డుకు అవతల దూరంగా ఉన్న వేరొకరి మోటర్ వద్ద నీళ్లు తెచ్చుకుంటున్నాం. కొత్తగా బోరు వేయించి నీళ్లు సరఫరా చేయాలి. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

కమాల్‌బీ, పులివెందుల రోడ్డు, వేంపల్లె.

సీసీ కెమెరాలు తప్పనిసరి

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి దుకాణ యజమాని తన వ్యాపారం చేసే చోట కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సినిమా థియేటర్లు, షాపింగ్‌మాల్స్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, హోటళ్లు, పాఠశాలలు, కాలేజీలు, బ్యాంకులు, రెస్టారెంట్లు, కెఫేలు ముఖ్యంగా బంగారు షాపుల యజమానులు తమ వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల చోరీలను అరికట్టే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చెన్నూరు కొత్త రోడ్డు లాంటి ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలు తప్పనిసరి అని ఆయన అన్నారు.

రక్తదానం చేయండి

కమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం గవర్నమెంటు హాస్పిటల్‌లో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ట్రస్టు అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్ తెలిపారు. బ్లడ్ ఇచ్చే దాతలు 9160531138, 7673945613 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.

'పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగు'

కడప సెవెన్ రోడ్స్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని యూటీఎఫ్ మీటింగ్ హాల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ వ్యతిరేక సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగులు లేకుండా దేశాభివృద్ధి అసాధ్యమని పేర్కొన్నారు. 2014 ఎన్నికల ముందు దేశ వ్యాప్తంగా జరిగిన బహిరంగ సభల్లో దేశ ప్రజలకు నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్నారు. సీపీఎం, ఎస్ఎఫ్ఐ,డీవైఎఫ్ఐ, ఐద్వా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాలయ పూజలు

సీకేదిన్నె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయనపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో బాలాలయ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణం కోసం పాత ఆలయాన్ని తొలగించేందుకు స్వామి విగ్రహాన్ని తొలగించే సమయంలో శుక్రవారం స్వామివారి శక్తిని కలశాల్లోకి మార్చి గోమాతతో లాగించి స్వామివారి విగ్రహాన్ని బయటకు తీశారు. అనంతరం విగ్రహాన్ని నవధాన్యాల్లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. గోమాతకు కూడా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు.

'ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం'

కమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామాంజులరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అనంతరం స్థానిక పెద్దదర్గాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రఘునాథరెడ్డి, వీరారెడ్డి, జడ్పీవైస్‌ఛైర్మన్ బాలయ్య, మహిళా అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, ఎంపీపీ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



హోలీ సంబరాలలో బంజారా మహిళలు

కడప కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అంజినాయక్, జిల్లా ప్రధానకార్యదర్శి సోనీకుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏఎల్. కాలనీలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. హోలీ సంబరాలలో ఆ కాలనీ వాసులు ప్రత్యేకంగా హాజరై తొలుత అక్కడ వెలసిన సేవాలాల్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టేజీపై వివిధ సినిమా పాటలకు పిల్లలు, పెద్దలు ఆనందంగా స్టెప్పులేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు వేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయక్, ట్రెజరర్ హనుమంత్ నాయక్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, సభ్యులు అనిల్ నాయక్, అంజినాయక్, శివానాయక్, బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో..: హోళీ సందర్భాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ. శివానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం శిల్పారామం సమీపంలోని గిరిజన భవన్‌లో బంజారా సంఘీయులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై హోలీ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ్ నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటరమణ నాయక్, జిల్లా అధ్యక్షుడు జగన్‌రాథోడ్, రాష్ట్ర నాయకులు రామమూర్తి నాయక్, వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, వేణుగోపాల్ నాయక్, మహిళా నాయకులు సావిత్రిభాయ్, సరోజా భాయ్ మహిళలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో జమ్ము తొలగించండి



శ్మశానం నిండా పెరిగిన జమ్ము

కడప మారుతీనగర్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): అది నగరానికి కూతవేటు దూరంలో ఉన్న 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె. గ్రామ ప్రజలకు కావలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలున్నాయి. కానీ అదేమి శాపమో కానీ 60 సంవత్సరాలుగా ఆ గ్రామానికి అవసరమైన శ్మశానవాటిక ఇప్పటికీ లేకపోవడం బాధాకరం. నాటి నుంచి అక్కడున్న చిన్నపాటి శ్మశానవాటిక కంపచెట్లు, పిచ్చిమొక్కలు, జమ్ముతో నిండుకునే వుంది. ఎండాకాలంలో కాస్త పరవాలేదు. వర్షాకాలంలో ఆరడుగుల జాగా కోసం పాట్లు పడాల్సిందే. అంతలా సమస్య వున్నా నేటికీ ఒక కొలిక్కి రాలేదు. పాలకులు మారుతున్నారే గానీ సమస్య మాత్రం అలానే వుంది. ఇంకా ఎంతకాలమో మరి......సమస్య తీరేదని గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.

'భార్యా బిడ్డల నిర్బంధం'

కడప క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చక్రాయపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి బాకీ డబ్బులు ఇవ్వలేదంటూ తన భార్య బిడ్డలను తీసుకెళ్లి నిర్బంధించారంటూ బాధితుడు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసేందుకు కడపకు వచ్చాడు. కాగా ఆయన అందుబాటులో లేరని బాధితుడు మీడియాతో మాట్లాడాడు. తన భార్య గంగాదేవి చక్రాయపేట మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి డబ్బు తీసుకుని వేంపల్లెలో ఫైనాన్స్ వ్యాపారం చేసిందన్నారు. సరిగా డబ్బులు ఇవ్వకపోవడంతో పూర్తిగా నష్టపోయామని దీంతో తమకు వడ్డీకి ఇచ్చిన వ్యక్తికి డబ్బులు ఇవ్వలేకపోవడంతో 20 రోజుల క్రితం తనతో పాటు తన భార్య బిడ్డలను బలవంతంగా తీసుకెళ్లి నిర్బంధించాడన్నాడు. కాగా వారం రోజుల కిందట తాను తప్పించుకుని వచ్చానని తెలిపారు. తన భార్య బిడ్డలను విడిపించి తనకు న్యాయం చేయాలని వాపోయాడు.

సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా కక్షసాధింపు ధోరణితో అంగన్వాడీ వర్కర్లను ఇబ్బంది పెడుతున్న చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని యూనియన్ గౌరవాధ్యక్షులు మనోహర్ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ పరిధిలో మైదుకూరు ప్రాజెక్టు, జీవీ సత్రం సెక్టార్ గల్లావాళ్లపల్లెలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న శ్రావణిని ఫేక్ రిపోర్టు ఇచ్చి మెమోల పేరుతో మానసికంగా, రాజకీయ కక్షసాధింపుల ధోరణితో ఇబ్బందులు గురిచేస్తున్న చాపాడు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనయన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ ఒక ప్రకటనలో జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. చిన్నపాటి ఉద్యోగులతో ఆడుకోవడం సరైంది కాదన్నారు. తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన చాపాడు సీడీపీఓపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

వేదాంత ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు





హాస్పిటల్ ప్రారంభిస్తున్న ప్రముఖ వైద్యుల తల్లిదండ్రులు, విలేకరులతో మాట్లాడుతున్న వైద్యులు దినేష్‌కుమార్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, క్రాంతి కుమార్ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో వేదాంత ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ వైద్యులు క్రాంతికుమార్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, దినేష్‌కుమార్‌రెడ్డి, శ్రీమాధుర్య, అశోక్‌రెడ్డి, శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిని వైద్యులతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనరల్ మెడిసిన్ సీనియర్ వైద్యుడు పి.మురళీమాధవ్ సహాయ సహకారాలతో జిల్లాలతోనే అతిపెద్ద విశాలమైన వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. అత్యాధునిక క్యాథ్‌లాబ్, బ్రెయిన్, స్పైయిన్‌కి హోల్ ఆపరేషన్లు, అత్యాధునిక లేజర్‌తో కిడ్నీలో రాళ్లు కరిగించుట, అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ విభాగం, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష ఆసుపత్రికి సంబంధించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జయసోమశేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్, శివారెడ్డి,శ్రీధర్‌రెడ్డి, మహబూబ్, ఓబుల్‌రెడ్డి, మృదుల, రాజావెంగల్‌రెడ్డి, సురేంద్ర బాబు, జగదీశ్వర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, క్రిష్ణకిషోర్‌రెడ్డి, మంజు, శృతి డైమండ్ నానో మైక్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత హరీష్, పీవీఎస్ కెమికల్స్ అధినేతలు నాగేంద్ర కుమార్, మునికుమార్, హరిప్రసాద్, దుర్గాప్రసాద్, టంబర్ డిపో శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.

వికాస్ హైస్కూల్లో ఘనంగా హోలీ



కడప ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. పిల్లలు రంగులు చల్లుకొని ఉత్సాహంగా సందడి చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయలతో హోలీ పండుగ ప్రత్యేకస్థానం సంపాదించిందని తెలిపారు. హోలి సామాజిక ఐక్యత ఆనందం సంప్రదాయాలను వ్యక్తపరిచే పండుగ అని కులమతాలకు అతీతంగా అందరు జరుపుకొనే పండుగ అని తెలిపారు. హెడ్‌మాస్టర్ హమీద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషి

పవన్ స్కూల్ కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి



మాట్లాడుతున్న కరస్పాండెంట్ జోగిరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 14: విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషిచేస్తున్నామని పవన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి అన్నారు. శుక్రవారం 32వ వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ లేకపోతే ఏమీ సాధించలేరని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దంత వైద్యుడు మధుసూదన్‌రెడ్డి,యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ హెడ్ కళ్యాణి ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జనసేన ఆవిర్భావ సభలో తుంగా రమణయ్య



జనసేన ప్రముఖులతో తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా జనసేన నాయకులు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో జనసైనికులు తరలివెళ్లారు. ఈ ఆవిర్భావ సభలో పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన ఆవిర్భావం తర్వాత 12 ఏళ్ల కాలంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని 2024 ఎన్నికలలో పోటీ చేసిన 21 సీట్లలో గెలిచి జనసైనికులకు ధైర్యాన్ని నింపిన నాయకుడు పవన్‌కళ్యాణ్ అన్నారు.

సాగునీరు అందించడమే టీడీపీ లక్ష్యం



గిడ్డంగివారిపల్లె పంప్‌హౌస్ మోటర్ ఆన్ చేస్తున్న జోగిరెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు

వేంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీటితో పాటు తాగునీటిని అందించడమే లక్ష్యమని హెచ్ఎల్సీ ఛైర్మన్ జోగిరెడ్డి, టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని గిడ్డంగివారిపల్లె పంపుహౌస్ నుంచి పీబీసీ కాల్వ ద్వారా టి.వెలమవారిపల్లె చెరువుకు నీటినిజోగిరెడ్డి, పీబీసీ ఈఈ రాజశేఖర్, రఘునాథరెడ్డి శుక్రవారం వదుదల చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, గిడ్డంగివారిపల్లె సుధాకర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, వెలమవారిపల్లె రామాంజనేయరెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.

వేంపల్లె పాపాఘ్నికి నీరివ్వాలి: వేంపల్లె పట్టణంలో తాగునీటికి ఇబ్బంది అవుతోందని, బోర్లు ఎండిపోతున్నాయని, పాపాఘ్ని ఎడారిగా మారింది, పీబీసీ నీళ్లు పాపాఘ్ని నది వరకు విడుదల చేయాలని ఈఈ రాజశేఖర్‌ను మండల కన్వీనర్ మునిరెడ్డి, ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర కోరారు. నెల తర్వాత నీటిని విడుదల చేయిస్తామని ఈఈ తెలిపారు.

లక్ష్మీదేవికి తామరహారం, పట్టుచీర అలంకరణ

వేంపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె నాలుగురోడ్ల కూడలిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన లక్ష్మీదేవికి లక్ష్మీజయంతి పురస్కరించుకొని అభిషేక పూజలు నిర్వహించారు. సర్పంచు ఆర్.శ్రీనివాసులు, ఆయన సోదరుడు ఆర్.వేణు బెంగళూరు నుంచి సొంత ఖర్చు రూ.26వేలతో తెప్పించిన తామర పుష్పాలహారం, పట్టు చీరతో అలంకరించారు. ఆలయ పూజారి అచ్యుత్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నేడు మతసామరస్యంపై సమావేశం

కడప సెవెన్ రోడ్స్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి, చెన్నూరు ఘటనల నేపథ్యంలో మతసామరస్యం-ప్రాధాన్యత అనే అంశంపై రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని మద్రాస్ రోడ్డులో గల నూర్జహాన్ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులను, ప్రజా సంఘాల, క్రిస్టియన్, మైనార్టీ సంఘాల నాయకులను పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సిద్ధిరామయ్య, నాయకులు షేక్ మక్బూల్ బాష, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16న ఈఏపీ సెట్, నీట్‌పై ఉచిత నమూనా పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు 16వ తేదీ ఉదయం 9 గంటలకు సృజన్ కోచింగ్‌సెంటర్‌లో ఈఏపీ సెట్, నీట్‌పై ఉచిత నమూనా పరీక్ష నిర్వహిస్తామని సృజన్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలో మొదటి బహుమతి రూ.2 వేలు, రెండవ బహుమతి రూ. వెయ్యి రూపాయలు అందజేస్తామని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షలకు వచ్చిన విద్యార్థులకు సబ్జెక్టు నిపుణులతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8099919877 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరంలో అన్నదానం



ముద్దనూరు మార్చి14(ఆంధ్రజ్యోతి):స్థానిక వైష్ణవి ఫిల్లింగ్ మిషన్ వద్ద శుక్రవారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీజేపీ నాయకుడు అన్నదానం చేశారు. ఈ వైద్య శిబిరంలో నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ సౌజన్యంతో కంటి, గుండె పరీక్షలు నిర్వహించారు. దాదాపు 80 మందికి వైద్య పరీక్షలు చేశారు.కంటి ఆపరేషన్ కోసం 24 మందిని కర్నూలుకు,గుండె ఆపరేషన్ కోసం ఇద్దరిని నంద్యాలకు తరలించారు.వైద్య పరీక్షలకు వచ్చిన వారికి బీజేపీ నాయకుడు గుణవంత్‌రెడ్డి ఉచిత బోజన వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో మానవతా మండల అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, మానవతా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విచారించి న్యాయం చేస్తాం

జమ్మలమడుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని పులివెందుల ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆయన జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, అర్బన్‌సీఐ లింగప్పతో కలిసి విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి బయట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులతోపాటు మృతురాలి తల్లితో ఆర్డీవో మాట్లాడారు. ఘటన ఎలా జరిగింది. ఎందుకు జరిగింది అనే దానిపై విచారణ జరపడంతో పాటు పోలీసుల నివేదికను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈసందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘనాయకులు లక్ష్మీనారాయణ, ప్రసాద్, శివకుమార్ తదితరులున్నారు.

స్వచ్ఛమైన తాగునీరు మళ్లీ ఎప్పుడో..?

- గత టీడీపీ పాలనలో ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా శుద్ధి చేసిన నీరు బిందె రూ.2లకే పంపిణీ
- వైసీపీ పాలనలో పథకాన్ని పట్టించుకోని వైనం
- ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలని ప్రజల వినతి



బద్వేలులోని ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం వాటర్ ప్లాంటు (ఫైల్)

బద్వేలు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన తాగునీరు మళ్లీ ఎప్పుడు అందుతుందోనని పేదలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. గత 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు దాతల సహకారంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించాలన్న సీఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు బద్వేలు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో బిందె రూ.2లకే అందించారు. అనంతరం టీడీపీ అధికారం కోల్పోవడంతో పథకం మూతబడింది. ప్రస్తుతం పది రూపాయల మేర బిందె తాగునీరు దొరుకుతోంది. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా 2014 నుంచి 2019 వరకు దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా 15 నుంచి 20 వరకు వాటర్‌ప్లాంట్లు ప్రారంభించి పేద, మధ్యతరగతి ప్రజలకు రూ.2లకే శుద్ధి చేసిన నీటిని అందించారు.బద్వేలు మున్సిపల్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో అప్పట్లో ఈ పథకం ద్వారా నాలుగుమినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఒకటి నుంచి రెండు చొప్పున ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ పథకం అందుబాటులో లేదు.

పేద, మధ్య తరగతి ప్రజల ఎదురుచూపు

2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో ఆ పథకం అందుబాటులో లేకపోవడంతో దాదాపు రూ.10కి బిందె నీటిని ప్రజలు కొనుగోలు చేసేవారు. ఇప్పటికి అలాగే కొనసాగుతుండడంతో ప్రజలు ప్రస్తుతం టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తిరిగి ఆపథకం ప్రారంభమవుతుందన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఘనంగా అంకాలమ్మ తల్లి తిరునాళ్లు



విద్యుత్ అలంకరణలో ఆలయం

బి.కోడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మున్నెల్లి గ్రామంలో వెలసిన అంకాలమ్మ తల్లి తిరునాల శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 16 గ్రామాల నుంచి నూనె డబ్బాలు, కోలాటం, బాజాభజంత్రీలు, బాణసంచాతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక్కడకు వచ్చిన భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తులందరికీ టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం చండీ హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, వేద పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం జ్ఞాన సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్ఞాన గురువు కంచి రఘురాం మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు సరస్వతీదేవిని ధ్యానం చేసుకోవాలని సూచించారు. విగ్రహ దాతలు జింకా ప్రకాశ్, సువర్ణ దంపతులు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులుగా జ్ఞానసరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం రావడం తమ అదృష్టమని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు రోటరీ క్లబ్ అధ్యక్షులు సాధు గోపాలకృష్ణ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో కోటపోలేరమ్మ తిరునాళ్లు ప్రారంభం

పోరుమామిళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కోట పోలేరమ్మ జాతర కార్యక్రమాలు ప్రారంభంమయ్యాయి, పోరుమామిళ్లలోని రంపాడు వీధిలో వెలసిన కోట పోలేరమ్మ దేవాలయంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలోని మహిళలు అమ్మవారికి చల్లన్నం తెచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం భక్తుల కోలాహలంతో ఆలయ ఆవరణమంతా నిండిపోయింది. శనివారం పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కోట పోలేరమ్మ ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారి పుట్టినిల్లు అయిన బలిజ కోట నుంచి కుంకుమ బండ్లతో మెరవణిగా అమ్మవారికి కానుకలు ఇచ్చి మొక్కుబడులు చెల్లిస్తార ని నిర్వాహకులు తెలిపారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు

బద్వేలు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన లక్ష్మి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ వాహనంపై స్వామి పురవీధుల్లో ఊరేగారు. పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

స్వర్ణాంధ్రను జయప్రదం చేయండి

బద్వేలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం స్వర్ణాం ధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేసి తడిచెత్త- పొడిచెత్త వేరుచేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

ఉత్సాహంగా హోలీ వేడుకలు



రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురష్కరించుకుని చిన్నారులు ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా హోళి పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు, రంగునీళ్ల చల్లుకుంటూ ఉత్సాహంగా ఉల్లాసంగా సందడిచేశారు.

బద్వేలులో ఘనంగా సంబరాలు



హోలీ సంబరాల్లో చిన్నారులు

బద్వేలుటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులలో శుక్రవారం హోలీ సంబరాలు మిన్నంటాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ అల్లరి ఆప్యాయతలతో కలగలిపి మరపురాని హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులు రంగులు పూసుకుంటూ కేరింతలతో ఘనంగా పండుగ నిర్వహించుకున్నారు.

బద్వేలు రూరల్‌లో, హోలీ పండుగను పురస్కరించుకుని యువకులు, యువతులు, చిన్నపి ల్లల వరకు రంగులు చల్లుకుంటూ ఘనంగా నిర్వహించారు. రంగులకేళీలతో యువతీ యువకులు కేరింతలు కొట్టారు.



అంగన్‌వాడీ కేంద్రంలో హోలి

కొండాపురంలో: మండల కేంద్రమైన కొండాపురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు రంగులు చల్లుకున్నారు. మన పం డుగల సంస్కృతి సంప్రదాయాలు పిల్లలకు తెలియజెప్పేందుకే హోలి వేడుకలు పాఠశాలలో నిర్వహించినట్లు అంగన్‌వాడీ టీచర్ డేరా జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: హోలి వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. శుక్రవారం పోరుమామిళ్లలోని కొన్ని పాంతాల్లో యువకులు రంగులను చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. అలాగే వైష్ణవి ఇంగ్లీషు మీడయం హనస్కూలులో కరస్పాండెంట్ రామకిష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు వేడుకలు జరుపుకున్నారు.



జమ్మలమడుగులో సంబరాలు

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శుక్రవారం హోలి పండుగను పిల్లలు, పెద్దలు, యువత ఆనందోత్సాహంతో జరుపుకున్నారు. స్థానిక అంబాభవానీ దేవాలయం ఎదురుగా హోలి పండుగను పురష్కరించుకుని స్థానికులు హోలి మంటలు సంబరాల మధ్య జరుపుకున్నారు. వసంతానికి స్వాగతం పలుకుతూ హోళీ సంబరాలు జరుపుకున్నారు.

కనకదుర్గా ఆలయంలో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బద్వేలుటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి)ః పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్న కనకదుర్గాదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకులు ప్రదీప్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

ఖాజీపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని ఎంఈవో నాగస్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 15 నుంచి ఒంటిపూట బడులు ఉదయం 7.45 నుంచి 12.30 గంటల వరకు నడపాలన్నారు. ఎక్కువ సమయం కేటాయిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ప్రైవేటు విద్యాసంస్థలు ఇవ్వాలని, విద్యార్థులు వారికి కేటాయించిన సెంటర్లకు 10 నిమిషాలకు ముందే చేరుకోవాలన్నారు. అ

గొడవలు సృష్టిస్తున్న విద్యుత్ స్తంభాలు



అధికారుల సమక్షంలో తగాదా పడుతున్న రైతులు (ఫైల్‌ఫొటో)



పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

దువ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో విద్యుత్తు స్తంభాలు రైతుల మధ్య తగాదాలు సృష్టిస్తున్నాయి. విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దువ్వూరు మండలంలో ఈ దుస్థితి నెలకొంది. రైతులు నీటి తడులు అందించుకునేందుకు విద్యుత్తు మోటార్లు ఎక్కువ మంది ఏర్పరచుకున్నారు. సాగునీటి లభ్యత ఉంటే రెండు పంటలు పండించుకోవచ్చన్నది రైతుల ఆలోచన. కొందరు భూస్వాములు వారికున్న ఆర్థిక అంగబలంతో సాధారణ రైతులతో తగాదాలకు దిగుతున్నారు. ప్రధానంగా విద్యుత్తు అధికారులు అస్తవ్యస్తంగా ఉన్న స్తంభాల సమస్య నివారించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ ఏఈ ఏమన్నారంటే: మండల విద్యుత్ శాఖ ఏఈ వీరారెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో విద్యుత్తు స్తంభాలు సరిగాలేని ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామన్నారు. నేలటూరు ఫీడర్ పరిధిలో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. దశలవారీగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పొలాల్లో స్తంభాలను, విద్యుత్తు వైర్లను సరిచేస్తామన్నారు.

ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం..ఎమ్మెల్యే పుట్టా



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ ,మార్చి14(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలలో గాయపడి ఆసుపత్రుల చుట్టు తిరిగి లక్షలు ఖర్చు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి కార్యకర్తకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించి ఆదుకొంటామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మైదుకూరు నియోజకవర్గంలోని 28 మందికి ముఖ్యమంత్రి సహాయక నిధి నుంచి సుమారు రూ.36 లక్షల43 వేల416 సంబంధించిన చెక్‌లను బాధితులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బీమయ్య, అన్నవరం సుధాకర్‌రెడ్డి, చిన్‌రెడ్డి లక్ష్మిరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న బీజేపీ నాయకుడు మధుసూదనరెడ్డి

ముద్దనూరు మార్చి14(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని చిన్నదుద్యాల గ్రామానికి చెందిన కవిత అనే మహిళకు సీఎం సహయనిధి నుంచి మంజూరైన చెక్కును శుక్రవారం బీజేపీ మండల నాయకుడు మధుసూదనరెడ్డి అందజేశారు. కవిత అనే మహిళ బోన్ క్యాన్సర్‌తో హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయమై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.7లక్షలు మంజూరైంది. ఈ చెక్కును బాధితురాలికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లరెడ్డి, కమలాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కూటమి నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



కూటమి నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కాశినాయన మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో శుక్రవారం కాశినాయన మహాద్వారం వద్ద కూటమి నాయకుల చిత్రపటాలకు టీడీపీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఇందులో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, మంత్రులు నారాలోకేష్, ఆనంరామ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిల చిత్రపటాలకు టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జ్యోతిలోని కాశినాయన ఆశ్రమం సమస్యను ఇక్కడ చోటుచేసుకున్న దురదృష్టకరమైన సంఘటనలను కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో చర్చించి సానుకూల నిర్ణయంవైపు అడుగులు పడేలా కృషిచేసిన వారికి క్షీరాభిషేకం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.రాజారెడ్డి, బి.గురివిరెడ్డి, అమర్‌నాద్‌రెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి, బివెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు ఖాజావలి, బాలగురయ్య, నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

జ్యోతిక్షేత్రంపై అటవీ అధికారుల తీరు దారుణం

కలసపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎందరో అనాథలు, అభాగ్యులకు ఆశ్రయమిస్తూ ఆకలితీరుస్తున్న జ్యోతిక్షేత్రంపై ఫారెస్టు అధికారులు అక్కడి కట్టడాలను కూల్చివేయడం అన్యాయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలసపాడులో విలేకరులతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అనేకమంది భక్తులు జ్యోతిక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సేద తీరుతుంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విషయాలను గుర్తించి కూల్చిన భవనాలను పునర్నిర్మించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో అటానమస్ హోదా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా విద్యార్థుల కోసం కృషి చేస్తున్న తమ కళాశాలకు నేడు అటానమస్ హోదా వచ్చిందని పేర్కొన్నారు. తమకు అన్ని విధాల సహకరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఒంటేరు శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. దీని వలన విద్యార్థులకు మంచి విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గౌరీశంకర్, ప్రిన్సిపాల్ ముస్తఫా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు సివిల్స్ సర్వీసెస్ పరీక్షపై అవగాహన

జమ్మలమడుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత సివిల్స్ శిక్షణకు సంబంధించి ఈనెల 16న (ఆదివారం) జమ్మలమడుగులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి చొరవతో లక్షుమయ్య, ఐఎఎస్ స్టడీ సర్కిల్ శిక్షణ అందించే వారు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సకారంతో ఉచిత సివిల్స్ శిక్షణకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అవగాహన కార్యక్రమానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు అర్హత పరీక్ష నిర్వహించి ఎంపికైనవారికి ఇందులో 30 మందికి రెండు సంవత్సరాలపాటు ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనవతసతి కల్పిస్తామని కూటమి నాయకుడు గోనా పురుషోత్తం రెడ్డి తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలో డిగ్రీ పూర్తి చేసుకున్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు 9885664465 నెంబరుకు సంప్రదించి తెలుసుకోవచ్చని వారు తెలిపారు.

వైభవంగా గౌర పౌర్ణమి వేడుకలు

- ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం



బలరామ కృష్ణులకు పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శుక్రవారం రాత్రి ఇస్కాన్ నిర్వాహకులు గౌర పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి శ్రీకృష్ణ బలరాముల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ గురువు శ్రీల భక్తిప్రేమ స్వామి మహరాజ్ ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. ప్రతి ఒక్కరు భగవద్గీతను పఠించాలని, దీని వలన విచక్షణా జ్ఞానం అలవడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ ఈ-స్కూల్ చిన్నారులతో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దాదాపు 30 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. పౌర్ణమి వేడుకల కోసం వచ్చిన భక్తులతో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానం కిటకిటలాడింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మైదానంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాశినాయన ఆలయంలో పౌర్ణమి పూజలు



కాశిరెడ్డినాయన

కొండాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో వెలసిన కాశి రెడ్డినాయన ఆలయంలో హోళి పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని గణపతి, అన్నపూర్ణే శ్వరి, కాశిరెడ్డినాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల మహా సంక్షేమ ర్యాలీ

పోరుమామిళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కడ ప జిల్లా పరిషత్ హాలులో ఈ నెల 16న మాజీ సైనికుల సంక్షేమ ర్యాలీ నిర్వహిస్తున్నా మని మాజీ సైనికుల సంక్షేమ సంఘ సభ్యుడు రాముడు తెలిపారు. ఆదివారం ఉద యం కలసపాడు నుంచి 7గంటలకు ఉచిత బస్సు బయల్దేరుతుందని అదే సమయానికి పోరుమామిల్ల నుంచి కూడా ఉచిత బస్సు బయల్దేరి మైదుకూరు మీదుగా కడప చేరు కుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు మాజీ సైనికులు, వీరనారీమణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులకు, వీర నారీమణులకు పెన్షన్, వైద్యం ఉద్యోగావకాశాలు, భూసమస్యలపై చర్చించడం జరుగతుందన్నారు.